# సన్మాన సభ

## ఎల్.ఆర్.స్వామి

అప్పారావు మనస్సు చాలా ఆందోళనగా ఉంది. సాయంకాలం కావస్తున్నా అతని అభిమాన హీరో, రాజకీయ నాయకుడు ఇంకా హోటల్లో దిగలేదు. ఆ సాయంత్రమే అతని సన్మాన సభ. పొద్దున్నే ఆరు గంటల కల్లా డ్యూటీ దిగిపోయినా తన అభిమాన హీరో ఎప్పుడు వస్తాడోనని, ఇంటికి వెళ్ళకుండా హోటల్లోనే తిరుగుతున్నాడు బేరర్ అప్పారావు.

గడియారం ఐదుసార్లు మోగింది. సన్మానసభ ఆరుగంటలకైతే హీరో ఇంకా రాకపోతే ఎలా? కొంపదీసి వేరే హోటల్లో దిగిపోయాడో ఏమో? ఆ అనుమానం రాగానే మేనేజర్ దగ్గరకు పరుగెత్తాడు అప్పారావు.

చెప్పడం మర్చిపోయాను. అప్పారావ్ హీరోగారు తిన్నగా సభకి వెళతారట. సభ ముగిశాకనే మన హోటల్ కి వస్తారట.

కొంప ముంచేశారండీ అప్పారావు అన్నాడు ఈ మాటముందే చెప్పి వుండవచ్చును కదండి. పొద్దున్నుంచి అతన్ని చూడాలని ఇక్కడే పడిగాపులు కాస్తున్నాను.

ఎందుకలా బాధపడిపోతున్నావ్? రూమ్ కి వస్తాడుకదా? నీకే కదా ఆ రూమ్ లో డ్యూటీ వేశాను.

ఆ మాటలు వినటానికి అప్పారావు అక్కడ నిలబడలేదు. రోడ్డుమీదకు వచ్చేశాడు. రోడ్డు చాలా రద్దీగా ఉంది. రంగురంగుల దుస్తులు ధరించి రోడ్డుమీద సాగిపోయే జనాలు ఆకాశ ప్రాంగణాన సాయంసంధ్యకి జరిగే సన్మానానికి కదలివచ్చే మబ్బులలా కనిపించారు. హీరోగారికి స్వాగతం పలుకుతూ అలంకరించిన తోరణాలలో కొన్ని ఆకాశాన హరివిల్లుగా మారాయి.

సభాప్రాంగణం చాలా సందడిగా ఉంది. ఎంత ప్రయత్నించినా ఓ అడుగు కూడా వెయ్యలేకపోయాడు అప్పారావు. దూరం నుంచి నాదస్వర ధ్వని, మంత్రఘోష వినిపించాయి. అక్కడక్కడ హీరో మీద జల్లిన పన్నీటిజల్లు ఆకాశానికెగిరి వానజల్లుగా మారి జనాలమీద పడ్డాయి.

వానకి తడిసిన జనం పరుగెత్తారు. అందరితోపాటు అప్పారావు కూడా.

అప్పారావుని చూసిన హోటల్ మేనేజర్ మండిపడ్డాడు. ఎక్కడ చచ్చావురా ఇంత సేపు? హీరోగారొచ్చి అప్పుడే అరగంట అయిపోయింది.

అరగంట అయిపోయిందా! అప్పారావు తనలో తనే తిట్టుకున్నాడు. హీరోగారు పిలిచేరాండీ? మెల్లగా అడిగేడు.

"పిలవకుండా వుంటారా మరి? మేనేజర్ కోపం ఆపుకోలేకపోయాడు. కదలకుండా ఇక్కడే కుర్చో!!

మరోగంటకి అప్పారావు ఎదురుచూసిన ఆ పిలుపువచ్చింది.



ఇదిగో ఈ విస్కీ బాటిల్స్ తీసికొని హీరోగారి రూమ్ కి వెళ్ళు.

పట్టరాని ఆనందంతో బయలుదేరాడు అప్పారావ్. మరికొద్ది నిమిషాల్లో తను తన అభిమాన హీరోని చాలా దగ్గర నుంచి చూస్తాడు. మాట్లాడుతాడు. విస్కీ అందిస్తాడు.

తన జన్మ చరితార్థమైనట్లు తోచింది అప్పారావుకి.

బెల్లు కొట్టగానే తలుపు తెరువబడింది.

అంతా అనుకున్నవిధంగా సవ్యంగానే జరిగింది సెక్రటరీ" హీరో అన్నాడు "గాని..."

"గాని....."

నాకొకటే అర్థంకావటంలేదు. నూటపదహారు దండలకి డబ్బులిచ్చాం కదా? మరి వంద దండలే అందాయి. మిగతా పదహారూ.."

అప్పారావు చేతులు వణికాయి. ప్లేటులోని విస్కీ నేలమీద పడింది.

అంతవరకూ భద్రంగా దాచిన విస్కీ నేలపాలైంది, నేలపాలైన విస్కీ మత్తు కలిగించదు కదా మరి!